క్లుప్తంగా

రోడ్డు మరమ్మతు పనులను పూర్తి చేయండి



రోడ్డు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

గుంతకల్లుటౌన్: పట్టణంలోని వివిధ ఏరియాల్లో జరుగుతున్న రోడ్డు ప్యాచ్ వర్క్‌లను త్వరితగతిన పూర్తి చేయించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని రామస్వామి గుడి వీధితో పాటు పలు ఏరియాల్లో జరుగుతున్న రోడ్డు మరమ్మతు పనులను ఆయన ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. అంతకుముందు ఆయన గంగానగర్‌లో వార్డు కౌన్సిలర్ అరుణతో కలిసి పర్యటించారు. ఇంటింటా చెత్తసేకరణ, తాగునీటి సరఫరా స్థానికుల సమస్యలపై ఆరాతీసి వాటిని పరిష్కరిస్తామన్నారు. డీఈ హేమచంద్ర, ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు ప్రారంభం

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో శుక్రవారం రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ పీరా, మున్సిపల్ అధికారులు రోడ్డు పనులు చేయించారు. రోడ్డుపై పడ్డ గుంతలను మట్టితో పూడ్చించారు. ఇంకా రెండు రోజుల పాటు రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు చేస్తామని పీరా తెలిపారు.

నాణ్యతలో మేటి భారతి సిమెంట్



తాపీ మేస్త్రీలకు బీమాబాండ్లు అందిస్తున్న ఇంజినీర్ మోతీలాల్‌నాయక్

యాడికి: నాణ్యతలో భారతి సిమెంట్ మేటి అని కంపెనీ టెక్నికల్ ఇంజినీర్ బి.మోతీలాల్ నాయక్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలో ఎంఎస్‌కేజీఎస్ హార్డ్‌వేర్, సిమెంట్స్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు భారతి సిమెంట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మోతీలాల్ నాయక్ మాట్లాడుతూ భారతి సిమెంట్ రోబోటిక్ టెక్నాలజీతో తయారవుతుందన్నారు. భవనాల స్లాబ్‌కు అనుకూలమైన సిమెంట్ అని, పర్యావరణానికి అనుకూలంగా ఉంటుందని తెలిపారు. భారతి అల్ట్రా ఫాస్టు సిమెంట్ గురించి అవగాహన కల్పించారు. అనంతరం మండలంలోని తాపీ మేస్త్రీలకు రూ.లక్ష విలువైన ఉచిత ప్రమాద బీమా బ్రాండ్‌లను అందజేశారు. భారతి సిమెంట్ డీలర్ మౌలాలి, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

పామిడి: రామగిరి సచివాలయాన్ని శుక్రవారం ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్, ఈఓఆర్డీ బీవీ శశికళ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు సచివాలయ రికార్డులు, హాజరు పట్టికలను పరిశీలించారు. సమయపాలనతో పాటు విధులను అంకితభావంతో నిర్వర్తించాలని వారు సిబ్బందికి సూచించారు. మండల ఇంజినీరు హేమ్లనాయక్, పంచాయతీ కార్యదర్శి షామీర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బాధిత కుటుంబానికి నగదు అందిస్తున్న దృశ్యం

తాడిపత్రి టౌన్: స్థానిక 8వ వార్డు సచివాలయ పరిధిలోని సీపీఐ కాలనీకి చెందిన చాకలి ఓబులేసు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో వార్డు సచివాలయ అడ్మిన్ సెక్రటరీ నరేష్, వెల్ఫేర్ సెక్రటరీ కేశవ, వలంటీర్లు శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను అందించారు.

విద్యార్థినిపై కుక్క దాడి

గుత్తి: పట్టణంలోని లచ్చానపల్లి రోడ్డులో శుక్రవారం మూడో తరగతి విద్యార్థిని దుర్గాపై కుక్క దాడి చేసింది. కుక్క దాడిలో దుర్గా గాయపడింది. దుర్గా ఇంటి ముందు ఆడుకుంటూ ఉండగా ఓ కుక్క ఉన్న ఫళంగా దాడి చేసి కరిచింది. కుటుంబ సభ్యులు దుర్గాను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

పామిడి: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్, ఈఓఆర్డీ బీవీ శశికళ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీడీఓ ఆఫీసుకు పని నిమిత్తం వచ్చే ప్రజలకు చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. పట్టణ సచివాలయాల కన్వీనర్ బీ ఆసిఫ్, పామిడి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ బోయ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతే జగనన్న లక్ష్యం

- ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

గుంతకల్లు రూరల్: రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల అభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం అని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వైటీ.చెరువు గ్రామంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వైవీఆర్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. పార్టీల కతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేసిన ఘనత ఒక్క వైఎస్సార్‌సీపీకి మాత్రమే దక్కుతుందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుకుంటూ వచ్చిన విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. వివిధ రకాల కారణాలతో ఇప్పటికీ పరిష్కారం కాని సమస్యలు ఉంటే వాటిని తెలుసుకొని పరిష్కరించాలన్న ఉద్దేశంతో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా నేరుగా మీ ఇంటి వద్దకే వచ్చామన్నారు. సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని ప్రజలకు భరోసా ఇచ్చారు. రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలూ కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని కోరారు. రాబోవు ఎన్నికల్లో మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జాషువా, ఎంపీపీ బీవీ మాధవి, వైస్ ఎంపీపీ చింబిలి ప్రభావతి, కో ఆప్షన్ సభ్యుడు సిపాయి బాషా, సర్పంచ్ సోనియా, ఎంపీటీసీ రామాంజినమ్మ, కిసాన్‌సెల్ జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, మండల కన్వీనర్ మోహన్ రావు, మండల సచివాలయ కన్వీనర్ గోవిందు నాయక్, మాజీ ఎంపీటీసీలు మద్దన్న, జయరామిరెడ్డి, మత్స్యసంఘం ప్రెసిడెంట్ నరసప్ప, నాయకులు గోవిందు, జయ్యన్న, దశరథ, లింగమయ్య, హరిశ్చంద్ర, పక్కీరప్ప, గోపాల్, పుల్లన్న, నాగన్న, షర్మాస్‌వలి, మస్తాని తదితరులు పాల్గొన్నారు.

రేపు సచివాలయ భవనాల ప్రారంభం

పామిడి: ఎద్దులపల్లి, రామగిరి గ్రామాల్లో రూ.80 లక్షలతో నిర్మించిన రెండు నూతన సచివాలయా భవనాలను ఆదివారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్ శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి ఉదయం 8 గంటలకు భవనాలను ప్రారంభిస్తారన్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారిగా శ్రీనివాసులురెడ్డి



యాడికి: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిగా శ్రీనివాసులు రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఉన్నత చదువుల కోసం వెళ్లాడు. దీంతో ఉన్నతాధికారులు ఇక్కడే వైద్యుడిగా పని చేస్తున్న శ్రీనివాసులురెడ్డిని మెడికల్ ఆఫీసర్‌గా నియమించారు. అందరికీ అందుబాటులో ఉండి మెరుగైన సేవలందిస్తానని ఆయన పేర్కొన్నారు.

ఫిట్స్‌తో బైకిస్టుకు తీవ్ర గాయాలు

- ఆస్పత్రికి చేర్చిన ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి



గాయపడిన వ్యక్తిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు రూరల్: బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ఉన్నపళంగా ఫిట్స్ (మూర్ఛ) రావడంతో అదుపుతప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. అపస్మారకస్థితిలో పడి ఉన్న అతడిని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి గమనించి తన వాహనంలోనే సకాలంలో ఆస్పత్రికి చేర్చారు. వివరాలిలా ఉన్నాయి. మొలకలపెంట తండాకు చెందిన రాముడునాయక్ శుక్రవారం వ్యక్తిగత పని నిమిత్తం గుంతకల్లుకు బైక్‌పై వచ్చాడు. పని ముగించుకున్న తర్వాత తిరిగి వెళ్తుండగా కసాపురం రోడ్డులో పెట్రోల్ బంకు వద్దకు చేరుకోగానే ఫిట్స్ రావడంతో అదుపుతప్పి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లాడు. తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని అటువైపు వచ్చిన ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి గమనించి కారును పక్కకు ఆపించారు. వెంటనే అతడిని తన కారులోనే గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులతో మాట్లాడి రాముడు నాయక్‌కు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

ఏకలవ్య ఆర్చ్ నిర్మాణానికి విరాళం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: పట్టణంలో ఏకలవ్యనగర్ ఆర్చ్ నిర్మాణానికి ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి రూ.25 వేల విరాళాన్ని అందజేశారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయనను ఏకలవ్య సంఘం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైవీఆర్ ట్రస్ట్ ద్వారా రూ.25 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వై.సుధాకర్, ఏకలవ్య సంఘం అధ్యక్షుడు నాగేంద్రప్ప, కార్యదర్శి వెంకటేష్, రామాంజినేయులు, భగవంతప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: నెలగొండలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే వైవీఆర్ తన కుమార్తె, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డితో కలిసి శుక్రవారం గ్రామస్తులకు తనవంతు విరాళం అందజేశారు. గ్రామంలో ఎటువంటి కార్యక్రమం చేపట్టినా తనవంతు సహకారం అందజేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

కొనసాగుతున్న 'జగనన్నే మా భవిష్యత్'



చెర్లోపల్లిలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

పుట్లూరు: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం కొనసాగింది. చెర్లోపల్లి, కడవకల్లు, సూరేపల్లిలో గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించడంతో పాటు ప్రజల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. అలాగే గత ప్రభుత్వానికి, జగనన్న పాలనకు గల వ్యత్యాసాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. వైఎస్సార్‌సీపీ యూత్ నేత మూలి దినేష్ రెడ్డి, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. కౌన్సిలర్ ఫరూక్, వార్డు ఇన్‌చార్జ్ మహబూబ్ బాషా, సచివాలయ కన్వీనర్లు సమీ, రఫీ ఆధ్వర్యంలో గృహ సారథులు, వార్డు వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. ఇంటి యజమానుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు.

గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడి నిజాయితీ



ల్యాప్ ట్యాప్‌ను అందజేస్తున్న విజయ భాస్కర్

గుత్తి: గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్ తనకు బస్సులో దొరికిన ల్యాప్ ట్యాప్‌ను బాధితుడికి అందజేసి తన నిజాయితీని చాటుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. పామిడికి చెందిన జగన్ అనే వ్యక్తి శుక్రవారం గుత్తి ఆర్టీసీ డిపోకు చెందిన అనంతపురం నుంచి కర్నూలుకు వెళ్లే బస్సులో ల్యాప్ ట్యాప్ మరిచిపోయి పామిడిలో దిగిపోయాడు. అయితే గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్ ల్యాప్‌ట్యాప్‌ను గమనించాడు. వెంటనే ల్యాప్ ట్యాప్ యజమాని వివరాలు కొనుగొన్నాడు. గుత్తి ఆర్టీసీ డిపోలో ల్యాప్‌ట్యాప్‌ను యజమాని జగన్‌కు అందజేశాడు. ఈసందర్భంగా పలువురు విజయభాస్కర్‌ను అభినందించారు.

ప్రతి రైతుకూ బిల్లు ఇవ్వాలి



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ నారాయణనాయక్

శింగనమల: ఎరువులు, మందులు కొనుగోలు చేసిన ప్రతి రైతుకూ బిల్లు ఇవ్వాలని ఏడీఏ నారాయణ నాయక్ సూచించారు. శుక్రవారం శింగనమలలోని పీఏసీఎస్ రైతు ఉత్పత్తిదారుల ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. ఎరువులను ఒకే రైతుకు అధిక మోతాదులో ఇవ్వడంతో టాప్ 20కి సంబంధించిన వివరాలు ఆరా తీశారు. రోజూ స్టాక్ రిజిష్టర్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.ఆయన వెంట ఏఓ చిన్నమ్మ ఉన్నారు. అనంతరం వ్యవసాయ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పీఎం కిసాన్‌కి సంబంధించి ఆధార్ లింక్, ఈ-కేవైసీ పూర్తి చేయించాలన్నారు. క్లస్టర్ కస్టమ్ హైరింగ్ సెంటర్‌ని త్వరగా పూర్తి చేయించాలని సిబ్బందికి సూచించారు. ఏఈఓ అక్కమ్మ, సిబ్బంది పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ఫేర్‌వెల్



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

గుత్తి: పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం సీఎస్ఈ, ఈసీఈ, ఎలక్ట్రికల్, సివిల్, మెకానికల్ ఫైనలియర్ విద్యార్థులకు థర్డ్ ఇయర్ విద్యార్థులు ఘనంగా ఫేర్‌వెల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గేట్స్ ఎండీ రఘునాథ్ రెడ్డి, కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా థర్డ్ ఇయర్, ఫైనలియర్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

ముతవల్లిగా షంషుద్దీన్



నార్పల: మండల ముతవల్లిగా డిపో షంషుద్దీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం జామీయ మసీదులో ముస్లింలు ఆయన్ను ముతవల్లిగా ఎన్నుకున్నారు. ఈయన రెండేళ్లపాటు ముతవల్లిగా కొనసాగనున్నారు. ఈ సందర్భంగా షంషుద్దీన్ మాట్లాడుతూ తన ఎన్నికకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

1 నుంచి ప్రత్యేక తరగతులు

తాడిపత్రి టౌన్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మే 1 నుంచి 24వ తేదీ వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష రాయబోయే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు హాస్టల్ వసతితోపాటు ఉచిత బస్ పాస్ కల్పిస్తామని పేర్కొన్నారు. ఉదయం 9-30 గంటల నుంచి సాయంత్రం 4-30 వరకు తరగతులు ఉంటాయని తెలిపారు.

గ్రామాల్లో ఫ్యాక్షన్ ప్రోత్సహించొద్దు

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యల్లనూరు: గ్రామాల్లో ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించొద్దని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం రాత్రి దంతలపల్లిలో ఉపాధి హామీ పనుల విషయంలో కొడవండ్లు, రాడ్ల దాడి చేసుకున్న విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తన అనుచరులతో పెద్ద ఎత్తున యల్లనూరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఎస్‌ఐ రామకృష్ణతో కేసు వ్యవహారం, సెక్షన్ల అమలుపై చర్చించారు. అనంతరం మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. బాలవెంకటరెడ్డి వర్గంపై సెక్షన్ 307(హత్యాయత్నం కేసు)ను నమోదు చేశారని మరి సర్పంచి నాగమహేశ్వరరెడ్డి, శివనాగిరెడ్డి వర్గంపై ఎందుకు ఆ సెక్షన్ నమోదు చేయలేదని పోలీసులను ప్రశ్నించారు. బాలవెంకటరెడ్డి వర్గానికి అన్యాయం జరిగిందని, ఈ విషయంలో చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనుల కోసం దంతలపల్లిలో కొట్టుకోవడం ఏంటని ప్రశ్నించారు. మండల స్థాయిలో ఎంపీడీఓ, తహసీల్దార్, పోలీసులు వంటి అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్నారు. పల్లెల్లో ఫ్యాక్షన్ మొదలవుతుందని చిన్నవాటికి కూడా కొట్టుకునే పరిస్థితి రాకూడదన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో కొందరు ఆధిపత్య పోరు కోసం చిచ్చుపెడుతుంటారన్నారు. ఫ్యాక్షన్ పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దళిత మహిళ గంగాదేవి ఎంపీపీగా కొనసాగుతుంటే ఆమెతో మండల గ్రాంటుకు సంబంధించిన వివరాలు, మండలంలో అభివృద్ధిపై కనీసం చర్చించిన దాఖలాలు లేవన్నారు. ఇప్పటికైనా అధికారుల తీరు మార్చుకొని గ్రామాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లో కక్షలు, ఫ్యాక్షన్ ను ప్రేరేపించే వారిపైన ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బయ్య, కిరణ్, జనార్దన్, అన్సర్, ఎంపీటీసీ తిమోతి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

గుంతకల్లుటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని వివిధ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ, కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు బి.సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ కార్యాలయంలో 137వ మే డే వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలన్నారు. జాతీయ కనీస వేతనంగా రూ.27 వేలు నిర్ణయించాలని, మోటార్, హమాలీ తదితర కార్మిక సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో కేంద్ర ప్రభుత్వంపై పోరాడతామని తెలియజేశారు. ఐఎఫ్‌టీయూ డివిజన్ కార్యదర్శి జి.చిన్నా, నాయకులు జిలాన్, దేవేంద్ర, గోపి, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు నాణ్యతగా చేయించండి



సమావేశంలో సూచనలిస్తున్న ఏపీడీ వెంకటరత్నం

యల్లనూరు: ప్రతి పంచాయతీలో కూలీల హాజరును పెంచాలని, ఉపాధి పనులు నాణ్యతగా చేయించాలని డ్వామా ఏపీడీ వెంకటరత్నం తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది 7ఏ రిజిష్టర్, వర్కు ఫైల్స్ 100 శాతం పూర్తి చేయాలన్నారు. అలాగే పని ప్రదేశంలో నేమ్‌బోర్డు, జాబ్ కార్డు అప్‌డేట్ పనులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కొండన్న, ఏపీఓ షబ్బీర్‌బాషా, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గార్లదిన్నె: ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ విజయభాస్కర్ కూలీలకు సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కనంపల్లి లో జరుగుతున్న ఉపాధి హామీ పనులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మస్టర్‌లో పేర్లు ఉన్న వారు మాత్రమే పనులు చేయాలన్నారు. రైతులకు అవసరమైన నాణ్యమైన పనులు చేయాలన్నారు. పనులు అడిగిన ప్రతి ఒక్కరికి పనులు కల్పిస్తామన్నారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజల సౌకర్యార్థం చలివేంద్రం ప్రారంభించారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



వీణా వినోదిని అలంకారంలో వాసవీమాత

తాడిపత్రి టౌన్: స్థానిక మెయిన్ బజార్‌లోని కన్యాక పరమేశ్వరీదేవి ఆలయంలో వాసవీమాత జయంత్యుత్సవాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం రాత్రి వాసవీ బాలకన్యకాదేవి వీణా వినోదిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తలుపుల సురేంద్ర నాథ్, కార్యదర్శి జయవరం ఆశ్వర్థ రంగయ్య, ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, సంయుక్త కార్యదర్శి సుబ్రమణ్యం కోశాధికారి వంకదార చిన్న మద్దిలేటి (రాజా), కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇంటి పట్టాలు



ముకుందాపురంలో పర్యటించిన అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్

గార్లదిన్నె: అర్హులందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేస్తామని అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ముకుందాపురంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ పర్యటించారు. ఈసందర్భంగా ఆయన దరఖాస్తుదారులతో మాట్లాడారు. అర్హత ఉంటే తప్పనిసరిగా ఇంటిపట్టాలు మంజూరు చేస్తామన్నారు. తహసీల్దార్ ఉషారాణి, ఆర్ఐ లహరి, వీఆర్ఓ ఆదినారాయణ పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

తాడిపత్రి టౌన్ : పట్టణంలోని 32వ వార్డు పప్పూరురోడ్డు మురగన్ కాంప్లెక్స్ శ్రీనివాసపురంలో శనివారం ఉదయం 7:30 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం జరగనుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

పశుగ్రాసం దగ్ధం

పెద్దవడుగూరు : చిన్నవడుగూరు గ్రామంలో మూడు రోజుల క్రితం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో రైతులు చంద్రశేఖర్‌రెడ్డి, బాస్కర్‌రెడ్డి, వెంకటేష్‌రెడ్డికి చెందిన గడ్డివాములు అగ్నికి ఆహుతైన విషయం తెలిసిందే. అయితే మంటల అదుపు చేసే సమయంలో కొంత గడ్డిని స్థానికులు వేరు చేశారు. ఆ సమయంలో ఆ గడ్డిలో ఉన్న నిప్పుతో గురువారం రాత్రి మంటలు చేలరేగాయి. గమనించిన స్థానికులు మంటలు అదుపు చేశారు. అయితే అప్పటికే గడ్డి పూర్తిగా కాలిపోయింది.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

గుంతకల్లు రూరల్: గుంతకల్లుకు చెందిన ఉపేంద్ర కర్ణాటక మద్యం తరలిస్తుండగా శుక్రవారం అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ మహేష్ కుమార్ తెలిపారు. నిందితుడి నుంచి 10 బాక్సుల మద్యం, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు.

నేడు ఆలయ భూముల కౌలు వేలం

పెద్దపప్పూరు: అమ్మలదిన్నె గ్రామంలోని చెన్నకేశవ స్వామి, ఆంజనేయ స్వామి ఆలయాలకు చెందిన భూముల కౌలు వేలాన్ని శనివారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నారు. ఈమేరకు ఈఓ సుబ్రహ్మణ్యం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ప్రజావ్యతిరేక విధానాలు విడనాడాలి

పెద్దవడుగూరు : కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు విడనాడాలని సీపీఐ సీనియర్ నేత సూర్యనారాయణరెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి వెంకట్రాముడుయాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం క్రిష్టిపాడులో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపండి.. దేశాన్ని కాపాడాలి అనే నినాదంతో ప్రచార భేరి కార్యాక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు గ్రామంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీగా వెళ్తూ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని వివరించారు. నాయకులు పోలా రంగస్వామి, హుసేన్‌పీరా, అల్లాబకాష్, అప్పేచర్ల నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: కొజ్జేపల్లి గ్రామానికి చెందిన ఓ యువతి శుక్రవారం ఉదయం విషపు గుళికలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన శిరీష అనే యువతి కొద్ది కాలంగా కడుపునొప్పితో బాధపడుతుండేది. కడుపునొప్పి తీవ్రం కావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషపు గుళికలు మింగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను గుత్తి ఆసుపత్రికి తరలించారు. వైద్యులు సూచనల మేరకు అనంతపురం తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.